# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ సమిష్టి బాధ్యతగా భావించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.**
2. **స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణ విషయాన్ని కేంద్రప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు.**
4. **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్ర చూడ్ ఈ రోజు దర్శించుకుంటారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఉక్కు పరిశ్రమలో పెట్టుబడుల ఉపసంహరణ విషయాన్ని కేంద్రప్రభుత్వం పరిశీలిస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. నిన్న ఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉక్కు పరిశ్రమ విషయంలో కొత్త ప్రక్రియ ఏమి లేదని, 2014 ముందు ఉన్న ప్రభుత్వం నిర్ణయాలపైనే ప్రస్తుతం చర్చ జరుగుతుందన్నారు. వాస్తవ పరిస్థితులు పరిశీలన చేసి శాశ్వత పరిష్కారం కోసం పని చేస్తున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

…వాయిస్..

---------------------------

దేశ వారసత్వ సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ సమిష్టి బాధ్యతగా భావించాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భారతీయ కళా మహోత్సవ్'ను నిన్న ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఈశాన్య రాష్ట్రాల కళాకారులతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ భిన్నమైన కళలు, సంస్కృతులకు మన రాష్ట్రాలు నెలవులని, ఈశాన్య ప్రాంత ప్రజలు తరతరాల నుంచి వీటిని పరిరక్షిస్తున్నారన్నారు. ఇటువంటి కళాప్రదర్శనలు సంస్కృతి, సంప్రదాయాలను ఇతర రాష్ట్రాలకు తెలియజేసేందుకు ఉపకరిస్తాయని

పేర్కొన్నారు. కాగా ఈ రోజు నుంచి వచ్చే నెల 6 వరకూ కొనసాగే కళా మహోత్సవ్‌కు వచ్చేవారు visit.rashtrapatibhavan.gov.in వెబ్‌సైట్ ద్వారా స్లాట్‌లను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

----------------------------

స్వర్ణాంధ్ర సాధనకు ప్రజల నుంచి సూచనలు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలను swarnandhra.ap.gov.in/Suggestions ద్వారా పంపవచ్చన్నారు. 2047 నాటికి మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పనకు పౌరుల సూచనలు ఆహ్వానిస్తున్నామని స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 వైపు ప్రయాణాన్ని ప్రారంభించామని చెప్పారు. ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటూ సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మించనున్నామని తెలుపుతూ ఈమేరకు సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు.

----------------------------

గుంటూరు ఛానల్ ఆధునికీకరణతో చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో కేంద్రమంత్రి నిన్న సమావేశయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో 77 గ్రామాలకు సాగు, తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ప్రాజెక్టుకు కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్ (28 సెకన్లు)

----------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి. వై. చంద్ర చూడ్ ఈ రోజు దర్శించుకుంటారు. గతరాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం జస్టిస్ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు.

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

----------------------------

తెలంగాణలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా తెలిపారు. హైదరాబాదులో నిన్న నిర్వహించిన బిజెపి సభ్యత నమోదు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం పార్టీ పార్లమెంట, శాసనసభ సభ్యులతో పాటు రాష్ట్ర పదాధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జేపీ నడ్డా మాట్లాడుతూ, తెలంగాణలో 50లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామని 15 రోజుల్లో నిర్దేశించుకున్న నమోదును పూర్తి చేయాలని పార్టీ

శ్రేణులకు సూచించారు. సభ్యత్వ నమోదుతో పాటు స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని దిశా నిర్దేశం చేశారు.

---------------------------

స్వచ్ఛమైన, పరిశుభ్రమైన దేశం కోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార అధికారి కె.శ్రీరామ మూర్తి అన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్‌లో నిన్న నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ మూర్తి మాట్లాడుతూ, ఈ నెల 17 వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని పరిసరాలను, గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, తద్వారా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ భారత్ గా మార్చేందుకు దోహదపడాలని కోరారు.

---------------------------

హైదరాబాద్‌లోని మూసీ నది నిర్వాసితుల్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మూసీ నదీ పరివాహక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి. కిషోర్ తెలిపారు. నిన్న హైదరాబాద్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు, నిర్వాసితుల తరలింపు, బాధితుల ఆందోళన తదితర అంశాల గురించి వివరించారు. చిన్న వర్షాలకే హైదరాబాద్ ముంపునకు గురవుతోందని, మూసీకి వరదలు వస్తే ఇబ్బందులు పడేది ప్రజలేనని అన్నారు. కుచించుకుపోయిన నదిని విస్తరించడమే తమ లక్ష్యమని తెలిపారు. నది సుందరీకరణ ద్వారా ఉద్యోగ అవకాశాలు వస్తాయని మూసీ ఆధునీకరణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

---------------------------

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించిన 'భేటీ బచావో భేటీ పడావో' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెనుకబడిన ప్రాంతాల్లో స్త్రీ నిష్పత్తిని పెంచడానికి, బాలికల చదువు కోసం కేంద్ర ప్రభుత్వం 'భేటీ బచావో భేటీ పడావో' అమలు చేస్తోందన్నారు. బాలల అక్రమ రవాణా నివారించడం, పౌష్టికాహార లోపం పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని అని చెప్పారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై బాలికలకు అవగాహన కల్పించనున్నామని మంత్రి వివరించారు.

=====================